7. పాపము చేసిన స్త్రీని గని – పాపుల కోపము మండెగదా = దాపున జేరి పాపిని బ్రోచిన – కాపరి వీవెగదా ॥సిల్వధరా॥

8. ఖాళీ సమాధిలో మరణమును – ఖైదిగ జేసిన నీవెగదా = ఖలమయుడగు సాతానుని గర్వము – ఖండనమాయెగదా ॥సిల్వధరా॥

9. కలువరిలో నీ శాంతి సుధా – సెలయేఱుగ బ్రవహించెగదా = కలుష ఎడారిలో కలువలు పూయుట – సిలువ విజయము గదా ॥సిల్వధరా॥

– ఎ.బి.మాసిలామణి

## 308 పాపము

రా – ముఖారి (చాయ : ఉన్నపాటున వచ్చుచున్నాను) తా–త్రిపుట

పాపకూపమునందు – పడి మునిగియున్నావు – పాటింపవది యెందుకు= పాప జన్మము పాపకర్మము – పాపపూరితమైన హృదయము – ఓపరాని భయంకరోగ్రత – శాపములు సమకట్టియుండగ ॥పాప॥

1. పరమాత్మ మీదనే – గురి నిల్పు మని దెల్పు – వరబోధమది నెంచవు = నిరత మును రాత్రియును బవలును – నిరవు ధనమును ఘనము సౌఖ్యము లరయు చుందువు క్షణము నీవా – పరమ ధర్మము సరకుజేయవు ॥పాప॥

2. కనివినంగ నుదగని – పనికిమాలిన క్రియల –దనిసి భ్రమయుచు నుందువు = ఘనుల పెద్దల జననీజనకుల – ననిశమును నిరసించి మెలగెడు వినయరహితంబైన జీవిత – మునకు నేమి ఘటిల్లునోకను ॥పాప॥

3. పెరవారలను బ్రియసో – దరులుగ బ్రేమింప – పరమాత్మపురికొల్పదే – పరులపై ద్వేషంబు పగగొని – పలుతెరంగుల బాధపఱచుచు – ప్రాణహత్య లొనర్చు నీకు – పరమ పదము లభింపసాధ్యమె ॥పాప॥

4. పాప పరిహారార్థ – ప్రాయశ్చిత్తము జేసి –ప్రాణమర్పించె నెవరో = ఆ పరాత్పరు నాశ్రయించుము – శాపభారము బాపిబ్రోచును – మాపు రేపునులేని స్వర్గ – ప్రాప్తికల్గును నిత్యశుభమగు ॥పాప॥

5. పాపభారము క్రింద – పడికుందు మీకునే – పరగనిత్తును శాంతిని – దాపు నకు రండంచు పతితుల – దయను బిలచెడు యేసుక్రీస్తును – పాపి కాశ్రయుడంచు నమ్మి – భక్తితో ప్రార్థించి వేడవే ॥పాప॥



6. శరణీయ వరమోక్ష – పురమందు ఘనసౌఖ్య – పరమానందము లొందుచు = వరుల దూతల – భక్తగణముల – సరసదేవు స్మరించు భాగ్యము– గురుడు నీకిడఁగోరి పిలుచుచు – కరము జాపెను – కౌగిలింపవె ॥పాప॥

– పంతగాని పరదేశి

## 309 క్రీస్తు సువార్త

రా – ముఖారి (చాయ : ఉన్నపాటున వచ్చుచున్నాను) తా–త్రిపుట

దారుణ మగు మరణ – వారిధి దాఁట నె – వ్వారి శక్యము సోదర = ఘోర మగు కెరటములవలె వి – స్తారముగ నేరములు పైఁగొని – పారు చుండునప్పు డద్దరిఁ – జేరు టెట్లు దారిఁ గనరే ॥దారుణ॥

1. ఒక్క పెట్టున నెగసి – చక్క వెల్బుద మన నీ – రెక్క లక్కఱకు రావు = ఎక్కడైనను నోడ గనుఁగొని – యెక్కిపోద మని తలంచినఁ – జెక్క నిర్మితమైన యోడ – లక్కఱకు రావేమి సేతుము ॥దారుణ॥

2. మంగళ ధ్వనులతో – శృంగారపురము వె– లుంగుచున్నది ముందట = పొంగి పారుచు మరణ నది త–రంగములఁ జెలంగుచున్నది భంగపడకుఁడి మనకు క్రీస్తు – సువార్తయను పెను నావ యిదిగో ॥దారుణ॥

3. వాద రహితుండైన – యాది దేవుఁడు దాని – నాథుం డనం బరఁగును = బాధ లొందిన నరుల నందరిఁ – జేరఁదీసిన క్రీస్తు యేసు – నాధుఁడే నావి కుఁ డు క్రైస్తవ – వేదమే చుక్కాని దీనికి ॥దారుణ॥

4. మానవు లందరు – మరణాంబుధిని దాఁట – మహనీయ మగు నావ యిదె = దీనిలో నెక్కుటకు ముందే – మానుగ వాక్యమును విని సు – జ్ఞాన మొందినవారు క్రైస్తవ – స్నాన మను పత్రికను బొందరె ॥దారుణ॥

5. విదితంబుగా నిందు – విజ్ఞాన బోధకుల్ – వినిపించుదురు వాక్యముఁ = గొదగొనిన యాత్మములు తృప్తిఁ – గొనును బ్రభు భోజనములోనే – హృదయములలో దేవునాత్మ – యెపుడు దీపంబై వెలుంగును ॥దారుణ॥

6. పలువిధ సంగీత – ములతో సాగుచు మనము – నలయ కుండఁగఁ బోదు ము = బలముగల యీ – యలలు దాఁటి – పరమ పురద్వారముల వెలుపల – గలిసికొని పరిశుద్ధ జనమును – గడకు మోక్షము చేరుకొందుము ॥దారుణ॥